తప్పటడుగులు

వెంపటి నాగభూషణం

అ

బు

తే...

ఎందుకూ...ఇంతకోపం?'

'ఎవరికి...'

'మరెవరికి...?'

'పంతమా?'

'ఏమో......'

'బాగానేఉంది. ఏంవగలుపోతారండీ!'

'కాదే...'

'అదిగో, ఆమాటే అనవద్దు అన్నది. ఎన్నిసారులు చెప్పాను? ఒసే...ఏమే... ఓయ్... ఓహో... ఆఁ... ఎవరక్కడ... ఇదిగో—ఎందుకు ఈ వెర్రివేషాలు? భార్యను మర్యాదగా పిలవడమనేది తెలియనే తెలియదా? ఇక, ఈలాటి ఛాందసపు సంబోధనలు మానేయకపోతే, నేను మీతో సావాసం కొట్టివేయాలిసి వస్తుంది....'

'మరి...ఏమనమంటావు?'

'వేరేచెప్పాలా? ఏం... పేరుపెట్టిపిలవడం చేతకాదా? ఓ వేళ, మీశాస్త్రులు అలా ఒప్పుకోవంటే...పోనీ, చప్పట్లు కొట్టండి! కాదంటారా, ఎదురుగుండా కనబడుతూనే ఉంటాను కాదూ...ఇంకా పిలుపు ఎందుకు?...ఊళ్లో అందరికీ తెలియాలా...మీ ఘనకార్యం?

'నీకవిత్వం......'

'అయ్యో, మీరు ఉన్నచోటికి ఆమడ దూరంలో ఎటుచూసినా...ఆధోరణి కనబడటమే! "దూరాత్ సంకుచితైవ గచ్ఛతి యథా చణ్డాలతశ్ఛాన్దసాత్"— అని చెప్పారుట, నిజమేనా?'

—పాపం... మానవుడు చిన్నబుచ్చుకుని...మొగం యింత చేసుకుని... కిక్కురుమనకుండా ఊరుకున్నాడు.

అంతా, అపసవ్యముగానే ఉన్నది—వైదికారణ్యంలో సింహవిక్రమం చలాయించడానికి నడుముకట్టుకున్న సనాతనమూర్తికి... ఏరికోరి, చుక్కకన్నెలతో పంతాలువేసుకుని వాదులాడుతూ మురిసిపోయే వయ్యారి ...ఇల్లాలు కావడం...

పొత్తు, ఇక ఏలా కుదురుతుంది...?

'ఏం...మాటాడరేం? మీదగ్గరఉన్న ఇదే అంత! జవాబుచెప్పకుండా...మూగనోము ముత్తైదువులాగ కూర్చుంటే...ఊరుకుంటా ననుకున్నారా ఏం? ఇదిగో... వస్తున్నా ముట్టుకోడానికి...'

'ఉండు, నీపుణ్యమాయెను! ఇంకా.. అర్ఘ్యవిధికాలేదు...మైలపడేయమాక...'

'పడితే...మళ్లా ఓమారు స్నానం...'

'నేను... చేయలేను'

'చేయలేక తీపెళ్లిందేం? ముక్కుపట్టుకు కూర్చుంటే కూర్చున్నారు కాని... ముసలితనం అభినయించమాకండి... వళ్లు మండుకు వస్తుంది!'

—చంద్రకళలో... సూర్య కాంతుల జీరలు మెరసిపోయినవి. కాని, ఆ మనోహర రామణీయకాన్ని... ఆనందాంకితము చేసుకుని లోబరచుకునే రసికమర్యాద... శివావధానిలో కనబడలేదు. ఆ అమ్మాయి మీద మీదకు రాబోతూన్న కొద్దీ... అతడు, చిత్రాసనం మీద కుదించుకు పోవడం మొదలుపెట్టాడు.

'ముద్దొస్తున్నారండి...!'—అని, గిలిగింతగా పలుకరించి హేళన చేయబోయింది-మనసు మార్చుకుని... జోహార్ అంటాడేమో నని.

"ఉండు, నీపుణ్యమాయెను! ఇంకా... అర్ఘ్యపాదికాలేదు... మైలపడేయమాక..."

'...నోచ్ఛిష్ట మధరం కురు...'- అని, నవ్వుతూ గీర్వాణం వెలిగించబోయినాడు! ఆమె, బెదరిపోయిన దానిలాగా...ఎత్తిన పాదం నేలను మోపకుండా-

'మరి, చెవికసుక్కు మనిపించాలా ఏం? ఈ మాత్రం సంస్కృతం నేర్పకుండా... నన్ను మీ యింటికి పంపలేదు మావాళ్లు. తలతిక్క వేషాలు వేయమోకండి...'

'ఏం ... మాటలు మరీ పెరిగిపోతున్నాయ్ ?'

'వాటికికూడా... మొగం వాయవలసి వస్తే...సరే, కానీయండి!'

...సరే, కానీయండి! ...ఈ ముక్కలతో వాళ్లప్రణయజీవనపు దోహదోపచారములు...కట్టుబడిపోయినవి. అన్న మాటలో అంత అర్థములేదు. కాని, చంద్రకళ...అవధాని సాన్నిధ్యానికి అంతటితో స్వస్తి చెప్పింది....

కోపంతో... నిస్పృహతో... ఆమె యిల్లువదలి బయటకు వచ్చేసింది. అవధాని మీద ఆమెకు ఆగ్రహంలేదు. అసలు... ఆతని తలపే లేదు!

రోళ్లు పగలకపోయినా...రోహిణిలోగా ఎండ మండిపోవడం మొదలుపెట్టింది. కపాలం చుర్రుమన్నది. దానికితోడు, లోపల ఉద్రేకం...రోషం....

తల్లిదండ్రులు...తనకు ఎందుకు ఇలా అన్యాయం చేయాలి? చక్కగా చదువుతూ అదీ చెప్పించి...చక్కని చూపులతో లోకంలోని అందం గమనించి...అనుభవించాలనే కోరికల మెలకువలు తెలియజెప్పే ఉపజ్ఞ అలవరించి...చివరకు, ఎందుకూ నోచుకోనని ఈ అరసికునికి...ఎందుకు అంటగట్టాలి?...కన్నవారు చేయవలసిన వంచనయేనా...ఇది?

...ఎన్నివిధాల ఆతనిమనస్సు మెప్పించాలని...ఎన్నిమారులు ప్రయత్నంచేసింది? ఎంత వలచింది...ఉవ్విళ్లూరింది! కాని, కఠిన మనసు...ఎలా కరుగుతుంది...?

అది, ఆయనలోపము కాదేమో... ప్రకృతే అంతేనేమో? ఉహుం...ఏమీ తెలియని పసిపాపా? అంత, భార్యను దూరంగా మడితో...జీవితమంతా గడపదలచినవాడు ...పెళ్లి చేసుకోకుండా ఉండలేకపోయినాడా? పోనీ.. పొరబాటున...ఏగ్రహచారవశాన్నో చేసుకున్నా...కాపురములేని ఈ కాపురము చేయడానికి...తగుదునమ్మా అని ఎందుకు తయారుకావాలి...?

...ఎదుటివారిచేత వ్రేలు వంపించుకోకుండా...లక్షణంగా కాపురంచేసి ఉభయకులాలకు ప్రతిష్ఠ తీసుకురమ్మని...దీవెనలిచ్చి సాగనంపారు పుట్టింటినుంచి...పెద్దముత్తైదువులందరూను! కలకాలం, తలవంచుకుని... లోపల కుమిలిపోతూ...శుష్కజీవనం గడపడంకన్న...వంచినవ్రేళ్లు అంచెలుగా ఆవేశపదానికి ఎగిసిపోయి...తరువాత ఏమైపోతే మాత్రం...విచారం ఏమున్నదీ...?

—ఆలోచనలు...ఇలా దోవాతెన్నూ లేకుండా సాగిపోయినవి...నిలుచున్న చోటనే. కాని, ఆ రసికాపతంసికి...అనుభవించడం ఏలాగో, ఏలా ఉపక్రమించాలో... తెలిస్తే కాదూ...?

తూలుతూ...వాడిపోతూన్న పూతీగ లాగా...తిరిగి మెట్లు ఎక్కి...తలుపుతోసుకుని, సద్దుచేయకుండా యింట్లోకి వచ్చి... దేవతార్చన గృహంలోకి తొంగిచూసింది-

శివావధాని,పరమశివ-నిశ్చలదీక్షలో... బాహ్యదృష్టి పూర్ణంగా ఉపసంహరించేసి... చలనం లేకుండా కూర్చుని ఉన్నాడు!

—చూసి, శోకం పొరలివచ్చి...గది లోకి పరుగెత్తుకుని వెళ్లి...క్రింద పడిపోయి, చాలాసేపు వెక్కి వెక్కి రోదనంచేసింది...

అవధాని బయట మెసులుతూనే ఉన్నాడు. పెద్దగా సూక్తములు పఠిస్తూనేఉన్నాడు. కాని, ఆ అమ్మాయి ఉన్న గది చాయలకైనా పోలేదు! కొంత సేపటికి మాత్రం— 'ఇంకా మడికట్టుకోలేదేం...ప్రొద్దెక్కడము లేదూ ?'-అని పొలికేకపెట్టాడు.

చంద్రకళకు వెర్రి ఎత్తుకు వచ్చి... ఆవేశంతో...మంచం కోడును ఫెడేలున తన్నింది. వంట చేయాలి!...అందుకోసం, ఆవేళకు తన అజ వచ్చింది ఆతనికి! ఏంచేస్తే పాపం ఉన్నది ? అయినా...కసి తీర్చుకునేందుకు ఆ ముచ్చటకూడా చెల్లించడం మంచిది...ఇక రేపటినుంచీ...

లేచి, పసుపు రాచుకుని స్నానంచేసి... వంటచేసి భోజనం పెట్టింది-అవధానికి. ఆసమయాన...నిత్యమౌనమే ఆతనివ్రతముకాబట్టి ఉభయులూ పలుకరించుకోవలసిన అవసరం కలుగలేదు. భోజనానంతరం...పగటిపూట తాంబూలచర్వణం చేయని నైష్ఠికుడికి... భార్యను పిలువవలసిన అగత్యం ఏమి ఉన్నది....?

లాంఛనానికి...ఎంగిలిపడిలేచింది, చంద్రకళ. శేషించిన పనులన్నీ తీర్చి...ఎక్కడి వక్కడ అమర్చి...వీథితలుపు దగ్గరగాలాగి, బయలుదేరింది—ఎక్కడికో! అవధాని, అప్పటికప్పుడే... చేయితడి ఆరకుండానే... భాష్యశ్రవణమునకు వెళ్లిపోయినాడు....

నడచిపోతూన్నది ... మల్లుతూన్న ఎండలో. దుమ్ముకొట్టుకోకుండా...రోడ్డుకు కొంచెంపక్కగా... అలా...ఎన్నో ఆలోచనలతో, ఊహలమీద ఊహలతో... తేలిపోతూన్నది.

—కారు...విసురుగా ముందుకువెళ్లిపోయి... బ్రేకుల బలవంతంమీద ఆగింది. డ్రైవరుసీటులోంచి...ఒకవయసుమళ్లిన పెద్దమనిషి...ఈ వంటరికత్తెను... ఆశ్చర్యంతో నిదానించి చూస్తున్నాడు. చూ...స్తూ...న్నా...డు!

ఆవాహనమునుగానివ్యక్తినిగాని అంతగా గమనించకుండానే...పరధ్యానంలో నడచి పో... సమీపించింది, చంద్రకళ.

'ఎక్కడికి...?'

—గరిమీసాల గుబురులోనుంచి... అదిరిపడేటట్టుగా పలుకరించి, పిలిచాడు ఆతడు. ఆ అమ్మాయి వినిపించుకోలేదు.

హారన్...గబగబా మ్రోగింది. కొంచెం ముందుకు వెళ్లినదల్లా, బెదిరి...తప్పుకొనేలాగ...ఓరగా వెనుదిరిగి చూసింది.

'ఎక్కడికి...ఒంటరిగా...?'— అంటూ రెట్టించాడు. ఎక్కడికో...ఆమెకు మాత్రం ఏమి తెలుసును? తాను ఎక్కడికో... ఆ రోడ్డు ఎక్కడికి వెళుతుందో...ఏమీ సమాధానం చెప్పలేకపోయింది. మళ్లీ, చెప్పక పోవడం బాగుండదేమో పెద్ద మనిషి అడుగుతూన్నప్పుడు...అని - 'ఇక్కడికే...మా ఊరు...'-అంటూ, తుదీ మొదలూ అందకుండా...జవాబిచ్చింది.

'నేనూ అటే పోతున్నాను. దించేస్తాను ...రా అమ్మా...ఫరవాలేదు...'- బలవంతం చేసి, కారు ఎక్కించి తన సరసను కూర్చో పెట్టుకున్నాడు.

సాగిపోతూన్నది...శరవేగంతో. అతను మధ్య మధ్య ఎన్నో ప్రశ్నలు వేశాడు. దేనికీ ప్రత్యుత్తరమీయలేదు...చంద్రకళ. ఒకటే పరాకు. ఒకమారు మాత్రం... అతని మోచేయి తనకు తగిలినట్లు తోచి...ఉలికి పడి పక్కకు ఒదిగింది.

...ఎంత సేపు ప్రయాణం చేశారో... చల్లని వెన్నెలలో...హాయిగా...మీదనుంచి



"మః షి...ఈ వంటరికత్తెను...ఆళ[illegible]ంతో నిదానించి చూస్తున్నాడు. చూ...స్తూ...న్నా...డు!"

తేలిపోతూన్న గాలిలో... మనసు మరచి పోయి... చెప్పలేనిపారవశ్యం అనుభవించింది.

'కొండపల్లి ... వచ్చాం ... '— అని ఆయన హెచ్చరించాడు. అంతటితో... చంద్రకళకు మెలకువ వచ్చింది. ఎక్కడనైతే నేం... అసలు గమ్యస్థానమే లేనప్పుడు... ఇక దిగిపోవడం మంచిది అనుకుని—

'నేను... దిగుతాను...'... అన్నది.

ఆపెద్దమనిషి ... ముఖంలో ఒక వింత వెలుగును సృష్టించుకుంటూ... కొంచెం చనువుగా—

'మీయిల్లు...ఎక్కడ ?'...అని, దగ్గరకు జరిగి... అడిగాడు. జవాబులేదు. మాటాడుతుందేమోనని ఒకనిమిషం ప్రతీక్షించి... ఆయన, ఆపిన కారును పోనిచ్చి... మెలికల కొండదారులగుండా తిప్పి తీసుకువెళ్లి... ఒక బంగళాదగ్గర ఆపి, దిగి... గేటు తెరిచి... కారు లోపల ప్రవేశపెట్టి,ఇంజన్ ఆపివేసి...

'దిగు...'-అని కొంచెం గదమాయింపుతో... అన్నాడు.

చంద్రకళకు ... ఒకమాదిరిగా ... తల దిమ్ము మనిపోయింది. ఏమిటి తాను చేసిన పని ?...ఎవరాయన ?... అక్కడకువచ్చింది ఎందుకు ?...ఏమి కానున్నది ?...ఇక...

భయంతోదిగి...కారుఆవలివైపున నిలుచుని...... 'నేను... తెలియక వచ్చాను. నన్ను...యింటిదగ్గర దింపండి, బెజవాడలో. ఏమో... నాకు మనసుచెడిపోయింది... '

ఇంకా...ఏమి చెపుదామనుకున్నదో, అమితభయంతో...ఏం చెపుతూన్నదో తెలియకుండా...ఆతడు దగ్గరకు సాభిప్రాయంగా...రావడం పొడగట్టగానే హఠాత్తుగా స్మృతితప్పిపోయింది.

మధ్యమధ్య... స్మృతి వస్తూన్నా... కనులు తెరిపిన బడినపుడల్లా... పిడుగుపడినట్టుగా... మరీ నిలువునా... నీరై క్రుంగిపోయి నరకయాతనలో మునిగిపోతూన్నది. జరుగుతూన్న దుర్వృత్తం ఛాయారూపం లీలగా అవగతమైపోయినా... ఇంతవిపర్యయమునకు సన్నద్ధురాలు ఎన్నడూ కాలేని ఆభిజాత్యం... ఆమెకు పరమశత్రువై... ప్రాణను మొదలంట నరికివేసింది. ఎదురించి... తనను, తన సర్వస్వాన్ని రక్షించుకోవలసిన పరీక్షా సమయం...జీవితంలో...ఆజీవితంలో...ఇక ఎన్నడూ రాదు...అని తెలుసునుకాని,... ఏంచేయుగలదు...ఝంఝూ ప్రళయంలో... ఒక లేతలతకూన ?

ఒంటరిగా... అవశమై... ఆతడు కారులోనుంచి దించేవ్యవధానం లేకుండానే...కుప్పకూలిపోయింది...నిలువలేక. కారు,ఆతను... సాగిపోయినారు... గంభీరంగా... ఏమీ తెలియనట్టుగా...

గంధగజ పాదోపహతమైన మృణాళిని కొన తంతువులతో... విరిసిన రేకలతో... ఇనకర స్పర్శభాగ్యా నంతరం మలగి... ప్రవాహంలో కలసిపోయే నిరీహాయత్నంతో ... మనోబలంతో ... లేచి ... తూలకుండా

నిలిచి... అనాలోకితముగా గుప్పెటలో ఇమిడి పోయిఉన్న పాపమూల్యాన్ని... కాలాహిని లాగా చీదరించుకుని విసిరివేసి... తాను మొదట కారు ఎక్కినచోటునుంచి... (ఆ పుణ్యాత్ముడు ఆ ఉపకారంమాత్రం చేసిపోయి నాడు)... ఇంటి మొగమైంది.

ఇంత జరిగినతరువాత... ఇక తల ఎత్తు కుని మళ్లా ఆయనఎదుట తిరగాలనికాదు... కాపురము, ఏమీ ఎరుగనట్లు చేయాలనీ కాదు...

అవధానికి కనుపించకుండా... కడసారి ఒక్కసారి చూచి...!...

ఇంటికి వెళ్లింది. కాని, ఆ అభాగ్య రాలికి... విధి... ఆ రవంత జీవితావకాశము లోనూ... సుముఖు డయే యోగ్యత ... లభిం చకపోయింది

ఆమె... రౌరవ యాతన అనుభవించిన వెన్నెలవేళనే... కృష్ణాతటిని... శివావధానిని తరంగమాలికలతో... స్వయంగ్రాహముచేసు కుని... రసికురాలైనది...!



క్రికెట్టు యోధుడు

S. S. S.